ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 10 మే 2025



ఉష్ణోగ్రత (అంచనా) 10-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	26
తెనాలి	39	27
నరసరావుపేట	41	25
బాపట్ల	38	27
రెంటచింతల	41	26
చీరాల	38	27

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి

- జిల్లాస్థాయి అధికారులు ముందుకు రావాలన్న కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): 'బంగారు కుటుంబాలను జిల్లా అధికారులు, గెజిటెడ్ అధికారులు దత్తత తీసుకోవాలి. బంగారు కుటుంబాలు ప్రభుత్వ సదుపాయాలను అందుకునేలా సహకరించాలి. మున్సిపల్ కమిషనర్లు, మండలాధికారులు వారి పరిధిలోని మార్గదర్శకులను ఎన్నుకోవాలి.' అని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. పీ-4, పీఎం సూర్యఘర్, ముఫ్త్ బిజ్లి యోజన అమలుపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తెచ్చేలా మార్గదర్శకులకు అవగాహన కల్పించాలన్నారు. బంగారు కుటుంబాల్లోని యువతకు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కల్పించాలన్నారు. 2027 నాటికి జిల్లాలో అన్ని కుటుంబాలకు సూర్యఘర్ పథకం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసరావు, పీడీలు కె.శ్రీనివాసరావు, విజయలక్ష్మి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఆంజనేయులు, డీపీవో ప్రభాకర్, డీఎల్‌డీవోలు విజయలక్ష్మి, పద్మావతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో మంత్రి రవికుమార్

అద్దంకి, మే 9 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని 33 మందికి రూ.34.77 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి అందజేశారు. అనంతరం అద్దంకి మండలంలో పర్యటించారు. ఇటీవల తమిళనాడులో మృతి చెందిన గోవాడకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మాదాల వెంకటేష్ తల్లిదండ్రులు నాగేశ్వరరావు, విజయలను మంత్రి పరామర్శించారు. విద్యుత్ సరఫరా, కొత్తగా స్తంభాల ఏర్పాటు సమస్యలను గ్రామస్థులు తెలపగా వాటిని పరిష్కరించాలని ఈఈ మస్తాన్‌రావుని మంత్రి ఫోన్‌లో ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఈ శివప్రసాద్‌ను మంత్రి ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం చేసుకుని బిల్లులు పొందని వారికి త్వరలో బిల్లులు వస్తాయని చెప్పారు. పీఐయూ డీఈ రమేష్ బాబు, టీడీపీ నేతలు మానం మురళీమోహన్‌దాసు, పుట్టా సాంబశివరావు, మాకినేని ఏడుకొండలు, నరిశెట్టి వీరరాఘవులు, మాదాల వెంకటేశ్వర్లు, రావిపాటి చన్నయ్య, కొండ్రు కిశోర్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్

స్థానికత.. సందిగ్ధం

- 2024లో దరఖాస్తు చేసుకున్న వారికే సర్టిఫికెట్లు
- గత ప్రభుత్వ సర్క్యులర్‌ను సాకుగా చూపుతున్న అధికారులు
- రెవెన్యూ అధికారుల తీరుతో డీఎస్సీ అభ్యర్థులకు కష్టాలు

గుంటూరు సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన షేక్ ఫర్హానా యాస్మిన్ కుటుంబం 2015 వరకు హైదరాబాద్‌లో ఉంది. ఆ తర్వాత వారు తిరిగి గుంటూరు వచ్చారు. యాస్మిన్ గుంటూరులోనే చదువుకున్నారు. ఆమె ప్రస్తుతం డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. స్థానికత సర్టిఫికెట్ కోసం దర ఖాస్తు చేసుకోగా జగన్ ప్రభుత్వ సర్క్యులర్‌ను సాకుగా చూపుతూ నిరాకరిస్తున్నారు.

..ఇదే పరిస్థితి అనేకమంది డీఎస్సీ అభ్యర్థులకు ఎదురవు తుంది. రెవెన్యూ అధికారుల సమాధానాలతో వారు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వచ్చిన వారికి రెవెన్యూ అధికారులు సినిమా చూపిస్తున్నారు. స్థానికత అంశాన్ని తేల్చకుండా ఇబ్బందులు పెడుతున్నారు. అవసరం ఉన్నప్పుడు మాత్రమే పొందే స్థానికత సర్టిఫికెట్ కోసం 2024లో దరఖాస్తు చేసుకుని ఉంటే ఇచ్చే వాళ్లమని ఇప్పుడు చెబుతున్నారు. స్థానికత అంశంపై గెజిట్ నోటిఫికేషన్, జీవో 133ని రెవెన్యూ అధికారులు తుంగలో తొక్కడం ప్రస్తుతం వివాదాస్పదమౌతుంది. ఈ జీవోను పలు మండలాల్లోని రెవెన్యూ అధికారులు పక్కన పెట్టేస్తున్నారు. 2024 జూన్ 1లోపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే స్థానికతను నిర్ధారించే సర్టిఫికెట్ ఇస్తామని చెబుతున్నారు. గత ప్రభుత్వం అందుకు అనుగుణంగా సర్క్యులర్ జారీ చేసిందని అధికారులు వాదిస్తున్నారు. అయితే 2024 జూన్ 1 లోపు మాత్రమే స్థానికతను నిర్ధారించే సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం ఎక్కడా ప్రకటన చేయలేదని పలువురు చెప్తున్నారు. ఒకవేళ అలాంటి జీవో ఉంటే లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులతో ముడిపడి ఉన్న ఈ విషయంలో పెద్దగా ప్రచారం కూడా చెయ్యలేదు. ఫలితంగా ప్రస్తుతం వెలువడిన డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న చాలా మంది అభ్యర్థులు స్థానికత రెవెన్యూ అధికారుల సమాధానాలతో ఏమి చేయాలో పాలుపోక ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ గత ప్రభుత్వం అప్పట్లో బహిరంగ ప్రక టన చేసి ఉంటే సర్టిఫికెట్లు పొందే వారమని పలువురు చెప్తున్నారు. ఇప్పుడు పిల్లల ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసిన తర్వాత సర్క్యు లర్ గురించి ఇప్పుడు అధికారులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ ఈ విషయంలో జోక్యం చేసుకుని గత ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



జీవో 133 ఏమి చెబుతుందంటే..

2014లో రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వం కొన్ని కీలక అంశాలపై ప్రత్యేకంగా జీవో జారీ చేసింది. 2016 జూన్ 13న వెలువరించిన జీవో 133 కూడా అటువంటిదే. ఈ జీవో ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన తేదీ నుంచి మూడేళ్ల కాలంలో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే వారిని మాత్రమే ఆయా జిల్లాల్లో స్థానికులుగా పరిగణలోకి తీసుకోవాలి. ఆ తర్వాత ఆ గడువును ప్రభుత్వం రెండు సార్లు మార్చింది. తెలంగాణ నుంచి ఆయా జిల్లాలకు వచ్చిన వారికి జీవో 133 ప్రకారం వారిని స్థానికులుగా గుర్తించి సర్టిఫికెట్లు జారీ చేయాలి.

బోధకులు లేక బాధలు

ఐదు బ్రాంచ్‌లు.. వెయ్యి మంది విద్యార్థులు ఉన్న నరసరావుపేట జేఎన్టీయూ (కే) కళాశాలలో బోధకులు లేరు. 80 మంది ప్రొఫెసర్లకు 71 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తొమ్మిది మంది ప్రొఫెసర్లకు ఇద్దరే ఉన్నారంటే ఏమేరకు ఇక్కడ విద్యాబోధన జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. బోధకులు లేక.. విద్యార్థులు ఇక్కడ చేరేందుకు ఆసక్తి చూపడంలేదు. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వ హయాంలో కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసింది. ఈ మేరకు ఇప్పటికీ అధ్యాపకులను వర్సిటీ నియ మించలేదంటే కళాశాలపై ఏపాటి శ్రద్ధ ఉందో తెలుసుకోవచ్చు. ఏళ్లుగా అతిథి అధ్యాపకులతోనే సరిపెడుతున్నారు. నరసరావుపేట సమీపం లో జేఎన్టీయూను 2016లో ప్రారంభించిన కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్టీయూ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందన్న విమర్శలున్నాయి. పోస్టుల భర్తీతో పాటు ఇతర అనేక సమస్యలతో కళాశాలలో విద్యార్థులు బాధలు పడుతున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు స్థాపించిన కళాశాలను నిర్వీర్యం చేసేలా వర్సిటీ పెద్దలు కుట్ర పన్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- 80 ప్రొఫెసర్ పోస్టులకు 71 ఖాళీ
- నరసరావుపేట జేఎన్టీయూలో అతిథులే దిక్కు
- 2018 నుంచి నియామకాలపై వర్సిటీ పెద్దల నిర్లక్ష్యం
- బోధన సాగక.. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లేక విద్యార్థుల అవస్థలు

ఖాళీల వివరాలు ఇలా..

క్యాడర్	ఉండాల్సిన వారు	ఉన్న వారు	ఖాళీ
ప్రొఫెసర్	9	2	7
అసోసియేట్లు	18	1	17
అసిస్టెంట్లు	53	6	47

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జేఎన్టీయూ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ.. ఇక్కడ సీటు కోసం విద్యార్థులు పోటీ పడుతుంటారు. అత్యుత్తమ బోధన.. క్యాంపస్ ప్లేస్‌మెంట్లే ఇందుకు కారణం. కానీ నరసరావుపేటలోని జేఎన్టీయూలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఇక్కడ సీటు వస్తున్నా వద్దని విద్యార్థులు వేరే దగ్గరకు వెళ్లిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయినా లోటుపాట్లను సవరించి ప్రతిష్ఠను మెరుగుపరచాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నరసరావుపేటలోని కళాశాలలో వసతుల మాట ఎలా ఉన్నా విద్యా బోధనకు గ్రహణం పట్టింది. పర్మినెంట్ అధ్యాపకులు తొమ్మిది మంది మాత్రమే ఉండగా వారిలో ఒకరు ప్రిన్సిపాల్. మొత్తం 71 మంది అధ్యాపకుల కొరత ఉంది. 22 మంది కాంట్రాక్టు, 18 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల్లో పనిచేసే వారిని నామమాత్రంగా నియమించారు. అధ్యాపకుల నియామకంలో వర్సిటీ వ్యవహరిస్తున్న తీరు దారుణమని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాలపై వర్సిటీ పెద్దలు కుట్ర పన్నారన్న ఆరోపణలకు ఇక్కడ నెలకొన్న పరిస్థితులు అద్దం పడుతున్నాయి. అటు పాలకులు.. ఇటు జేఎన్టీయూ కాకినాడ వర్సిటీ అధికారులు కళాశాల నిర్వహణను గాలికొదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణాలకు నిధులు.. విద్యార్థులకు అవసరమైన వసతులు.. అధ్యాపకుల కొరతను వర్సిటీ పట్టించుకోకుండా విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోందని పలువురు మండిపడుతున్నారు. బోధన సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఉద్దేశపూర్వకంగా అధ్యాపకులను నియమించడంలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కళాశాలను నిర్వీర్యం చేసేలా అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. అతిథి అధ్యాపకులతో కాలం గడుపుతుండటంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రాంగణ నియామకాల్లో విద్యార్థుల ఎంపికే ఇందుకు ఆధారం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్లను నియమించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఆలోచన వర్సిటీ పెద్దల్లో లోపించింది.

ప్రాంగణ ఎంపికలు ఇలా..

సంవత్సరం	ఎంపికైన విద్యార్థులు
2021	180
2022	150
2023	110
2024	153
2025	72



నరసరావుపేట జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల



భవనాసికి.. భూసేకరణ భారం

- రూ.4.20 కోట్ల నుంచి 40 కోట్లకు పెరుగుదల
- 2009 నుంచి సా..గుతున్న రిజర్వాయర్ నిర్మాణం
- రూ.27 కోట్లతో ప్రారంభం.. వంద కోట్లకు పెరిగిన అంచనా వ్యయం
- ఎమ్మెల్యేగా గొట్టిపాటి శంకుస్థాపన.. మంత్రి హోదాలో పూర్తి చేస్తారని ఆశ

అద్దంకి, మే 9 (ఆంధ్రజ్యోతి): 16 సంవత్సరాలు గడిచింది.. అంచనా వ్యయం రూ.27 కోట్ల నుంచి రూ.100 కోట్లు పెరిగింది.. భూసేకరణ వ్యయం రూ.4.20 కోట్ల నుంచి రూ.40 కోట్లు పెరిగింది.. అయినా ఇంకా భవనాసి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాలేదు. అసలు ఇది ఎప్పటికి పూర్తి అవుతుందంటే ఎవరూ చెప్పలేకపోతున్నారు. రిజర్వాయర్‌కు చక్రాయపాలెం వద్ద 2009 జూన్‌లో అద్దంకి ఎమ్మెల్యే హోదాలో గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. రూ.27 కోట్లతో 4 ప్యాకేజీలుగా విభజించి పనులు మొదలు పెట్టారు. అప్పట్లోనే చెక్‌డ్యామ్, చెరువు అభివృద్ధి పనులు అత్యధికశాతం పూర్తయ్యాయి. గుండ్లకమ్మ నది నుంచి భవనాసి చెరువు వరకు తవ్వే కాల్వ పనుల్లో కొన్నిచోట్ల పెద్ద బండరాళ్లు ఉండటంతో బ్లాస్టింగ్‌కు అనుమతులతో పనులు ఆలస్యమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.45 కోట్లకు చేరగా కొంతమేర పనులు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అంచనాలను రూపొందించగా అది రూ.80 కోట్లకు చేరింది. అప్పట్లో పనులకు అనుమతులు రాలేదు. ప్రస్తుతం అంచనాలు రూపొందించగా వ్యయం రూ.100 కోట్ల దాటిందని సమాచారం. ప్రధానంగా భూసేకరణ వ్యయం పెరగడానికి ప్రధాన కారణం అప్పట్లో భవనాసి చెరువు పరిసర ప్రాంతాల్లో పంట పొలాలు కాగా ప్రస్తుతం అవి చేపల చెరువులుగా మారడంతో పరిహారం భారీగా పెరిగిందని తెలుస్తోంది.

మంత్రి రవికుమార్‌పైనే ఆశలు

ఎమ్మెల్యేగా గొట్టిపాటి శంకుస్థాపన చేసిన భవనాసి రిజర్వాయర్ పనులు సుమారు 16 ఏళ్లుగా పూర్తి కాలేదు. నాడు శంకుస్థాపన చేసిన గొట్టిపాటి ఇప్పుడు మంత్రిగా ఉన్నారు. దీంతో మంత్రి హోదాలో రిజర్వాయర్ పనులు పూర్తవుతాయనే ఆశతో రైతులు ఉన్నారు. పనులపై ఇప్పటికే ఉన్నతాధికారులతో సమీక్షించిన రవికుమార్ మళ్లీ కొత్త అంచనాలను తయారు చేయించి సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం.



చిల్లచెట్లతో మూసుకుపోయిన గుండ్లకమ్మ నుంచి రిజర్వాయర్‌కు తవ్విన కాల్వ

రైతు బంధ్



- రుణం అందక రైతుల గగ్గోలు
- ప్రకటనల్లోనే రైతుబంధు పునరుద్ధరణ
- మూడు జిల్లాల్లో గతేడాది రూ.15 కోట్లు కేటాయింపు
- ప్రచారానికే పరిమితం.. రైతులకు ప్రయోజనం నామమాత్రం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి ధర తగ్గడం.. అయినకాడికి అమ్ముకుని అప్పుల ఊబిలో కూరుకుపోవడం రైతులకు పరిపాటిగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా 2014-2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ఈ పథకంలో రైతులు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ గోడౌన్లలో నిల్వ చేసుకుంటే నామమాత్రపు అద్దె వసూలుతో పాటు నిల్వ చేసుకున్న పంట విలువలో 70 శాతం రుణం రూపేణా అందించేది. దీని వల్ల రైతులు ఉత్పత్తులను సరైన ధరకు అమ్ముకోవడానికి కొంతమేర వెసులుబాటు దొరికేది. కానీ గత ప్రభుత్వంలో ఈ పథకం ఆనవాళ్లు లేకుండా చేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో రైతుబంధు పథకం పునరుద్ధరణపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఇందుకు అనుగుణంగా గతేడాది అక్టోబరులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఈ పథకం కింద రూ.15 కోట్లు కేటాయించింది. కానీ అది ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఆ ఫలాలేవీ తమకు అందలేదని రైతులు వాపోతున్నారు. గుంటూరు జిల్లాకు రూ.4 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.5 కోట్లు, పల్నాడు జిల్లాకు రూ.6 కోట్ల విడుదలకు అనుమతులిచ్చింది. మూడు జిల్లాల పరిధిలో రూ.15 కోట్ల వరకు నిధుల కేటాయింపు జరిపితే అంతా కలిపి కోటి రూపాయలు కూడా రైతులకు మేలు జరగలేదు. బాపట్ల జిల్లాలో 9 మంది రైతులకు రూ.15లక్షల రుణ సదుపాయం కల్పించి మమ అనిపించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్న చందంగా ప్రభుత్వం నిధులు కేటాయించినా ఆ ఫలాలు రైతులకు అందలేదు.

2014-19 మధ్య ముమ్మరం

రైతుబంధు పథకం 2014--19 మధ్య ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్ద ఎత్తున అమలైంది. పంట ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ చేసుకుని ఏడాదికి దాదాపు రూ.45 కోట్ల వరకు రుణాలను రైతులు తీసుకున్నారు. నిల్వకు నామమాత్రపు అద్దె, నిల్వ చేసిన దిగుబడిలో 70 శాతం మొత్తం తక్కువ వడ్డీకి తొమ్మిది నెలల గడువు రుణంతో రైతులకు మేలు జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం రైతుబంధు పథకం పూర్తి స్థాయిలో అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం ధర బహిరంగ మార్కెట్‌లో ఆశాజనకంగా లేదు. కొన్ని పరిమితులకు లోబడే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించింది. గడచిన ఖరీఫ్, ప్రస్తుతం ధాన్యం ధర మద్దతు రేటుకన్నా బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.300 వరకు తీసికట్టుగానే నమోదైంది. అయినా రైతుబంధు పథకంలో ధాన్యాన్ని నిల్వ చేసుకునే పరిస్థితులు లేక రైతులు తెగనమ్ముకుని నష్టాలు పాలయ్యారు. లక్షల టన్నుల ధాన్యం తక్కువ ధరకు దళారీల పాలైంది. రైతుబంధు పథకం ద్వారా రుణం ఇచ్చి ఉంటే అప్పులు తీర్చుకొని ఉండేవాళ్లమని రైతులు తెలిపారు.

గోదాముల విషయంలోనూ నిర్లక్ష్యం..

గత ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాలరాసి ఏకంగా మార్కెటింగ్ గోడౌన్లను ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చింది. దీంతో రైతులకు అటు రైతుబంధు ఫలాలు ఎండమావిగా మారడంతో పాటు ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. ఇప్పుడు కూడా గోదాముల విషయంలో దాదాపుగా అదే నిర్లక్ష్యం కొనసాగుతూ ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న మార్కెట్ యార్డుల్లో 178 వరకు గోదాములు ఉన్నాయి. వీటిలో దాదాపు 2.20 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ గడచిన ఖరీఫ్ సీజన్‌లో మార్కెటింగ్ గోదాముల్లో నిల్వ చేసుకున్న ధాన్యం అంతా కలిపి కూడా 50,000 టన్నులకు మించలేదు. గోదాములలో నిల్వ సామర్థ్యం అంతంతమాత్రంగా ఉండడం కూడా రైతుబంధు పథకం అమలుకు ప్రతిబంధకంగా మారినట్లు తెలుస్తోంది.



బాపట్ల మార్కెట్ యార్డులోని గోడౌన్

యుద్ధానికి యువత సాయమందించాలి

● లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్



మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్

పెదకాకాని, మే9 (ఆంధ్రజ్యోతి): యుద్ధానికి అవసరమైనప్పుడు ప్రభుత్వ కోరిక మేరకు యువత సాయం అందించాలని, తమదైన రంగాల్లో రాణించి దేశభక్తిని చాటాలని 10(ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్ సుదర్శన్ శుక్రవారం పేర్కొన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ బాలికల శిక్షణ శిబిరంలో విశ్రాంత మేజర్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఎస్.దశాకతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్‌పై శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకునే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్ చెప్పారు. డాక్టర్ దశాక మాట్లడుతూ బాలికలు పాఠశాల దశలోనే ఎన్‌సీసీలో చేరడం ద్వారా భవిష్యత్ మెరుగ్గా ఉంటుందన్నారు.

13న పెన్షన్ అదాలత్

గుంటూరు (విద్య), మే 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పట్టణంలోని కృష్ణానగర్‌లో ఉన్న ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదులను కార్యాలయం లేదా (94946 57469)వాట్సాప్, మెయిల్ ద్వారా పంపవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 0864-2344106, 0864-2232921 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

చిరస్మరణీయంగా ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన

విజేతలకు ద్విచక్ర వాహనాలు, నగదు బహుమతులు



ప్రథమ బహుమతి కేశవరెడ్డికి రాయల్‌ఎన్‌ఫీల్డ్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, నాగసాయి వైదీప్తి

పొన్నూరుటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): ధూళిపాళ్ల మెమోరియల్ జాతీయ స్థాయి వృషభరాజాల బల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా ముగిశాయి. ఎనిమిది రోజుల పాటు పెద్ద ఎత్తున జరిగిన ఈ పోటీలను ప్రతి ఒక్కరూ సమన్వయంతో విజయవంతం చేయడంపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ధన్యవాదాలు తెలిపారు. సీనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా, పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన ఓరెడ్డి కేశవరెడ్డి, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఎస్ఎస్ఆర్ బుల్స్ సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలిచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను సొంతం చేసుకున్నాయి. అలాగే ఇతర విజేతలకు పది ద్విచక్ర వాహనాలతో కలిపి మొత్తం రూ.30 లక్షల విలువైన బహుమతులను ప్రదానం చేశారు. 8 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో 131 జతల ఒంగోలు ఎడ్లు పాల్గొన్నాయి. ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణకు ఎమ్మెల్యే, సంగం డెయిరి ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ పోటీలను నిర్వహించారు. ఇందుకు 360 అడుగుల కోర్టును ఏర్పాటు చేశారు. ప్రేక్షకులు, ఎడ్లకు ఎండ తీవ్రత లేకుండా సాయంత్రం వేళల్లో బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ప్రాంగణం చుట్టూ ఐదువేల మంది పట్టేలా గ్యాలరీలను సిద్ధం చేశారు. పాల్గొన్న ప్రతి ఎడ్ల జత యజమానికి ప్రోత్సాహక బహుమతులు, మామిడి మొక్కలను నిర్వాహకులకు అందజేశారు. రాష్ట్ర మంత్రులు పోటీలకు హాజరై, బహుమతులు ప్రదానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వైసీపీ నేత దాడిలో గాయపడి..చికిత్స పొందుతూ మృతి



బెజవాడ రమేష్ (ఫైల్‌ఫోటో)

మాచర్ల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు గొడ్డలితో దాడి చేయడంతో టీడీపీ కార్యకర్త కోమాలోకి వెళ్లి.. నాలుగు నెలలపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే... మాచర్ల మండలం పశువేముల గ్రామానికి చెందిన టీడీపీకి కార్యకర్త బెజవాడ రమేష్ (28)కు, అతని మామ వైసీపీకి చెందిన పండ్ల హరిశ్చంద్రకు కుటుంబ కలహాలున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది డిసెంబరు 16న హరిశ్చంద్ర గొడ్డలితో దాడి చేశాడు. దీంతో రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతను కోమాలోకి వెళ్లడంతో విజయవాడలోని ఓ ఆసుపత్రిలో నాలుగు నెలలుగా చికిత్స అందిస్తున్నారు. అప్పటి నుంచి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ శుక్రవారం తుది శ్వాస విడిచాడు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే రమేష్ కోమాలో ఉండడంతో కుటుంబ సభ్యులు మనస్తాపానికి గురై గత నెలలో హరిశ్చంద్ర (60)ను హతమార్చారు.

కంటైనర్, బైక్ ఢీ: విద్యార్థులకు గాయాలు

● పెట్రోలు లీకై దగ్ధమైన బైక్



గాయపడిన విద్యార్థిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న 108 సిబ్బంది

యడ్లపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న కంటైనర్, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు గాయపడగా, బైక్ దగ్ధమైంది. వంకాయలపాడు సమీపంలోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని జగ్గాపురం, యడ్లపాడు గ్రామాలకు చెందిన వెంకటేష్, హరీష్, చిలకలూరిపేట మండలం సోమరపాడు గ్రామానికి చెందిన శివబాబు ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని మిట్టపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. మధ్యాహ్నం కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై ముగ్గురూ ఇంటికి బయలుదేరారు. వంకాయలపాడు-ఎస్ఎస్ఎల్ టెక్స్ టైల్స్ మధ్య ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. బైక్‌తో సహా ముగ్గురూ రోడ్డుపై పడి, తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్రవాహనం ట్యాంకు నుంచి పెట్రోలు లీకై మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానికులు 108కు సమాచారం అందించగా.. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 513.40 అడుగులు ఉంది. ఇది 137.51 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,350, మొత్తం ఔట్‌ఫ్లో 1,350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

టీడీపీ శ్రేణులకు.. విదుత్ ఉద్యోగి షాక్..!

● నాడు దుర్భాషలాడి.. నేడు సీఎంను కలిసి..
● విద్యుత్ శాఖ ఉద్యోగికి టీడీపీలో పెద్దపీట
● వైసీపీ ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలా వ్యవహారం
● పార్టీ అధిష్ఠానం.. జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదులు



సీఎంతో విద్యుత్ ఉద్యోగి బంగారయ్య

నరసరావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): అతను విద్యుత్ శాఖలో ఉద్యోగి. వైసీపీ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను నానా దుర్భాషలాడాడు. నాడు వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్‌గా పేరొందాడు. చంద్రబాబు, లోకేశ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. నరసరావుపేట నియోజకవర్గం గోపిరెడ్డి అడ్డా 60 వేల మెజార్టీతో పల్నాడు జిల్లాలో ఆయన చరిత్ర సృష్టించబోతున్నారు అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఘనత ఆ ఉద్యోగిది. పార్టీ అధినేతలను సోషల్ మీడియా వేదికగా తిట్టిన వ్యక్తి.. నేడు సీఎం చంద్రబాబును కలవడంతో పార్టీ శ్రేణులు కంగుతిన్నాయి. ఉద్యోగి తన కుటుంబ సభ్యుని పేరుతో ఏర్పాటు చేసిన హెవీ వాహనాల డ్రైవింగ్ స్కూల్‌ను కూడా ఎమ్మెల్యే ప్రారంభించడం పార్టీలో చర్చనీయాంశమైంది. చంద్రబాబు, లోకేష్‌ను తిట్టిన విద్యుత్ శాఖ అకౌంట్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న రాఘవరపు బంగారయ్య.. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి బుధవారం చంద్రబాబును కలవడం గమనార్హం. ఈ ఫోటోలు.. నాడు చంద్రబాబు.. లోకేశ్‌కు వ్యతిరేకంగా పెట్టిన పోస్టులను టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. పార్టీ అధినేతలను దుర్భాషలాడిన ఉద్యోగిని చంద్రబాబు దగ్గరకు తీసుకువెళడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఈ మేరకు సదరు ఉద్యోగి.. చంద్రబాబు, లోకేశ్‌కు వ్యతిరేకంగా, డాక్టర్ గోపిరెడ్డికి అనుకూలంగా పెట్టిన పోస్టులను, వైసీపీ నేతలతో ఉన్న చిత్రాలను పార్టీ అధిష్ఠానానికి పంపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కూడా పిర్యాదు చేశారు. చంద్రబాబును తిట్టినా సరే సదరు ఉద్యోగి కోటు వేసి చంద్రబాబును కలిపేంత గొప్ప మనసున్న మారాజు అరవిందబాబు అంటూ సోషల్ మీడియాలో క్యాడర్ పోస్టులు పెట్టడం పార్టీలో చర్చనీయంశమైంది. దీని ద్వారా పార్టీ క్యాడర్‌కు ఎటువంటి సందేశం ఇస్తున్నారంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. సదరు ఉద్యోగి విధులకు సరిగా హాజరు కాకపోయినా చర్యలు లేవని, వెంటనే చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

లిఫ్టులో ఇరుక్కుపోయిన ఎంపీ, చీఫ్ విప్



బయటకొస్తున్న చీఫ్ విప్ జీవీ

వినుకొండటౌన్, మే 9, (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ ఛైర్మన్ మక్కెన మల్లి కార్జున రావు ఎక్కిన లిఫ్ట్ ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో కొన్ని నిమిషాలపాటు నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన పట్టణంలోని లాయర్ స్ట్రీట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. లాయన్ స్ట్రీట్‌లో ఉన్న యూనియన్ బాంక్‌పై నూతనంగా ఏర్పాటు చేసి ఉషోదయ సోలార్ అండ్ అగ్రీ కార్యాలయం ప్రారంభోత్సవానికి కార్యక్రమానికి ఎంపీ, చీఫ్ విప్, జీడీసీసీ ఛైర్మన్ హాజరయ్యారు. బిల్డింగ్ యజమానితో కలిసి రెండో అంతస్తుకు చేరుకునేందుకు వీరు లిఫ్ట ఎక్కారు. కెపాసిటి ముగ్గురికి మించి అందులో ప్రయాణించకూడదు. కానీ, నలుగురు ఎక్కడంతో రెండు అంతస్తుల మధ్య లిఫ్ట ఆగిపోయింది. దీంతో కార్యకర్తలు, నాయకులు గాబరాపడ్డారు. ఇంతలో లిఫ్ట మెకానిక్‌ని తీసుకువచ్చి మరమ్మతులు చేపట్టడంతో.. అంతా ఊపిరి పీల్చుకున్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురికి రిమాండ్

నిందితుల్లో వైసీపీ ఎంపీటీసీ కల్పన

మంగళగిరి సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన నలుగురు నిందితులకు మంగళగిరి న్యాయస్థానం రెండు వారాల రిమాండ్ విధించింది. తాడికొండ సీఐ కె.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. కంతేరు గ్రామంలో గత నెల 25న చెలరేగిన వివాదం వర్గపోరుకు దారితీసింది. ఓ వర్గం మరో సామాజిక వర్గంపై దాడికి పాల్పడినట్లు తాడికొండ పోలీసులకు ఫిర్యాదు అందింది. మొత్తం పది మందిపై కేసు నమోదు కాగా, వారిలో నలుగురు నిందితులను శుక్రవారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కర్రి నిఖిల్ (ఏ-5), కర్రి మహాలక్ష్మి (ఏ-7), వైసీపీ ఎంపీటీసీ వలపర్ల కల్పన (ఏ-8), కర్రి విజయభాస్కర్ (ఏ-10) ఉన్నారు. నిందితులను మంగళగిరి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు వారాల రిమాండ్ విధించారు. అరెస్టయిన వారి తరపున మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైసీపీ నేతలు డైమండ్ బాబు, వేమారెడ్డి, ఈదులమూడి డేవిడ్‌రాజు తదితరులు న్యాయవాదులతో కలిసి కోర్టు వద్దకు వచ్చారు.

విద్యుత్ ప్రాజెక్టు భద్రతపై ఎస్‌పీఎఫ్ ప్రత్యేక దృష్టి



టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు(ఫైల్ ఫోటో)

రెంటచింతల, మే 9 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మించిన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు భద్రత గురించి ఎస్‌పీఎఫ్(స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) ఉన్నతాధికారులు శుక్రవారం సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఇప్పటి వరకు భద్రత పరంగా ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారనే దానిపై సమీక్షించారు. పాకిస్తాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఎస్‌పీఎఫ్ డీఎస్పీ టీకే చారి స్థానిక ఎస్ఐ మూర్తితో మాట్లాడారు. ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించాలని, నిఘా కట్టుదిట్టంగా ఉంచాలని ఆదేశించారు. క్షణం క్షణం ఉన్నతాధికారులతో టచ్‌లో ఉండాలని కోరారు. సత్రశాలలోని ప్రాజెక్టు వద్ద 17 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది డ్యాంకు ఇరువైపులా, గేట్ల దగ్గర భద్రతా విధులు నిర్వహిస్తున్నారు.

96,112 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 85,708 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 96,112 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 17,960 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	14000
334	9500	13400	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	----	----	సింజెంటా బ్యాడిగి 5531	---	---
341	10000	13300	దేవనూరుడీలక్స్	10000	12500
4884	10000	11200	ఆర్మూరు	9800	11200
సూపర్10	10000	12600	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					

ట్రాలీ ఢీకొని..ద్విచక్ర వాహనదారుడి మృతి

నూజెండ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొత్త ఉప్పలపాడు సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన కుంటా వెంకటరెడ్డి(62) వ్యక్తిగత పనుల నిమిత్తం వినుకొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఉప్పలపాడు నుంచి ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం కొమ్మవరం గ్రామానికి కూలీలతో వెళ్తున్న ఆటో ఎదురుగా అతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరెడ్డి రోడ్డుపై పడడంతో.. మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బీవీ కృష్ణారావు పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ

గురజాలటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): రిమాండ్‌లో ఉన్న ఖైదీ పరారైన ఘటన శుక్రవారం జరిగింది. దాచేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసులో నిందితుడిగా.. గురజాల సబ్ జైలులో షేక్ జిలానీ రిమాండ్‌లో ఉన్నాడు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది మధ్యాహ్నం జైలు నుంచి జిలానీని గురజాల కోర్టుకు వాయిదా నిమిత్తం తీసుకెళ్లారు. ఇదే అదునుగా నిందితుడు పోలీసు సిబ్బంది కళ్లుగప్పి కోర్టు వద్ద నుంచి పరారయ్యాడు. దీనిపై సబ్‌జైల్ సూపరింటెండెంట్ అచ్చినాయుడును వివరణ కోరగా.. జరిగిన ఘటనపై గురజాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

వ్యవసాయ పర్యావరణ కూటమిలో

రైతు సాధికార సంస్థకు సభ్యత్వం

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పర్యావరణ కూటమిలో ఏపీ రైతు సాధికార సంస్థ సభ్యత్వం తీసుకోనుంది. రైతు సాధికారత, సుస్థిర, సహజ వ్యవసాయం, వాతావరణ స్థితి స్థాపకత, పర్యావరణం కోసం ఏపీ సామాజిక సహజ వ్యవసాయం పేరుతో రైతు సాధికార సంస్థ మార్గదర్శక ప్రయత్నాలకు గుర్తింపుగా కూటమిలో సభ్యత్వం తీసుకోనుంది. ఈ మేరకు వ్యవసాయ పర్యావరణ కూటమి నుండి రైతుసాధికార సంస్థకు ఆహ్వానం అందింది. సభ్యత్వానికి ఆర్థిక బాధ్యత లేనందున రైతు సాధికార సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏపీ-ఏఐసీఈటీ ఇంటర్న్‌షిప్స్ డ్యాష్ బోర్డు ప్రారంభం

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యార్థులకు ఉన్నత విద్యామండలి, జాతీయ సాంకేతిక విద్యా మండలి సంయుక్తంగా వేసవి స్వల్ప కాలిక ఇంటర్న్‌షిప్‌లు అందించనున్నాయి. దీనికి సంబంధించిన డ్యాష్ బోర్డును ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఈ ఏడాది మూడు లక్షల మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారు. ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ నెల 7 నుంచి 18 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్, 23న విద్యార్థుల ఎంపిక, 25న జాబితా ప్రకటిస్తారని వివరించింది. జూలై 27 నాటికి ఈ ఇంటర్న్‌షిప్‌లు పూర్తవుతాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె





ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమం

బాపట్ల, మే9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలపై బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అర్జీలను స్వీకరించి పరిష్కారమార్గాలను చూపించారు.

సాక్ష్యాల సేకరణలో నైపుణ్యం పెంచుకోవాలి

● ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ పద్ధతిలో భౌతిక సాక్ష్యాధారాల సేకరణలో నైపుణ్యత పెంపొందించుకోవాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులకు తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణుల ఆధ్వర్యంలో జిల్లాలో పని చేస్తున్న దర్యాప్తు అధికారులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై కేసు దర్యాప్తులో భౌతిక ఆధారాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ వర్క్ షాపులలో ఫోరెన్సిక్ నిపుణులు తెలియజేసిన మెళుకువలను కేసుల దర్యాప్తులో వినియోగించి న్యాయ స్థానాలలో నిందితులు శిక్షింపబడే విధంగా కేసులను దర్యాప్తు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వర్, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు రామాంజనేయులు, మోయిన్, శ్రీనివాసరావు, సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, ఏఆర్‌డీఎస్పీ విజయసారథి, మంగళగిరి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణులు, జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు, సంబంధిత కోర్టు పీపీ, ఏపీపీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడి

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు : ఎస్పీ

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : చట్టవ్యతిరేక, సంఘవిద్రోహ చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఇచ్చిన మార్గనిర్దేశాలను అనుసరించి ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం గురువారం రాత్రి జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా గత రాత్రి విస్తృత తనిఖీలు నిర్వహించటం జరిగిందన్నారు. జిల్లాలో 39 ప్రదేశాలలో 2840 వాహనాలను పోలీసులు తనిఖీలు చేశారన్నారు. వీటిలో సరైన ధ్రువపత్రాలు లేని 17 వాహనాలు సీజ్ చేశామని, మరో 150 వాహనాలకు జరిమానాలు విధించినట్టు తెలిపారు. జిల్లాలోని 13 రైల్వేస్టేషన్‌లలో తనిఖీ చేసి అనుమానితులను విచారించటం జరిగిందన్నారు. 71 లాడ్జిలు, హోటల్, రిసార్ట్‌లలో తనిఖీలు చేసి వాటిల్లో బస చేసిన వారి వివరాలు సేకరించి ఎవరైన వ్యక్తులు అనుమానస్పదంగా ఉంటే సంబంధిత పోలీసు స్టేషన్‌అధికారికి సమాచారం అందించే విధంగా నిర్వాహకులకు తగిన సూచనలివ్వటం జరిగిందన్నారు.

శ్రీభావన్నారాయణస్వామి రథోత్సవానికి మంత్రికి ఆహ్వానం



మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి దివ్యరథోత్సవ కార్యక్రమం ఈ నెల 12వ తేదీన జరుగుతున్న తరుణంలో రథోత్సవ కార్యక్రమానికి దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆహ్వానపత్రాన్ని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ ఉన్నారు.

శేషవాహనంపై శ్రీ క్షీరభావన్నారాయణస్వామి



శేషవాహనంపై శ్రీ క్షీరభావన్నారాయణస్వామి

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కొలువై ఉన్న శ్రీ క్షీరభావన్నారాయణస్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారు ఉభయదేవేరులతో శేష వాహనంపై ఆశీనుడై ఉండగా భక్తులు గ్రామోత్సవాన్ని నిర్వహించి విజయవంతం చేశారు. శేషవాహనంపై ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకోవటం వలన సకల సర్పదోషాలు తొలుగుతాయని భక్తుల నమ్మకం.


రేపు లక్ష్మీనరసింహ జయంతి

పిట్టలవానిపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీరాజ్యలక్ష్మీసమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 11వ తేదీన స్వామి వారి జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంవీఎస్ వర్మ తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను నిర్వహించి రాత్రి 7 గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ఊరేగింపు

బాపట్ల, మే9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణం దరివాదకొత్తపాలెంలోని శ్రీ రామచంద్రస్వామి, సీత, లక్ష్మణ, ఆంజనేయస్వామి జీవధ్వజ, శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలో స్వామివార్ల విగ్రహాల ఊరేగింపుని ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు నిర్వహించారు.

పర్యావరణ కార్యదర్శి సునీతకు డాక్టరేట్



డాక్టర్ కోలా సునీత

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల బేతనీకాలనికి చెందిన 1వ వార్డు సచివాలయంలో పర్యావరణ కార్యదర్శిగా పనిచేస్తున్న డాక్టర్ కోలా సునీత ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం నుంచి డాక్టరేట్ పట్టాను అందుకోనున్నారు. పసిఫిక్ వైట్ ష్రింప్ హెచరీస్‌లో వాటి లార్వా ఫీడ్స్, బయోఫ్లాక్ టెక్నాలజి సమర్ధత మీద దాదాపు 10 సంవత్సరాలు ప్రొఫెసర్ పి.పద్మావతి పర్యవేక్షణలో ఆధ్యయనం చేశారు. వర్సిటి రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ ఆచార్య పి.సుధాకర్ కోలా సునీతకు పీహెచ్‌డీ ప్రదానం చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా వర్సిటి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సైన్స్‌కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య వీరయ్య, డీన్ ఆఫ్ నేచరల్ సైన్సెస్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, డిపార్టుమెంట్ హెడ్ వి.వెంకటరత్నమ్మ, జియాలజి డిపార్ట్‌మెంట్ హెడ్ ఆచార్య రత్నాకర్, వివిధ విభాగాల ఆచార్యులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్లపాలెం మే 9 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం గణపవరం ఆక్వా ఫీడర్ పరిధిలో విద్యుత్ కండక్టర్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9.00 నుంచి 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ బాషా తెలిపారు. పాత కండక్టర్ స్థానంలో కొత్త కండక్టర్ ఏర్పాటు చేస్తున్నామని ఆక్వా రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

శివారు ప్రాంతాలకు ట్యాంకర్‌లతో తాగునీరు

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణ శివారు ప్రాంతాలకు, పైపులైను లేని ప్రాంతాలకు బాపట్ల పురపాలక సంఘం వారు వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీరు సరఫరా చేయటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి అన్నారు. తాగునీరు సరఫరాలో సదరు ప్రాంత ప్రజలకు ఇబ్బంది కలిగినా లేదా ట్యాంకర్‌లు సకాలంలో రాకపోయినా వెంటనే పురపాలక సంఘం కాల్‌సెంటర్ నెంబరు 9849908208నకు తెలియజేస్తే వెంటనే వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

● ఎమ్మెల్యే ఆనందబాబు



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు (వేమూరు), మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు అలసత్వం చూపితే సహించేది లేదని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హెచ్చరించారు. చుండూరులో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 100కి పైగా అర్జీలను వివిధ సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు సమర్పించారు. వాటిలో రెవెన్యూ, విద్యుత్, ఆర్ అండ్ బీ, నీటిపారుదల శాఖలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వచ్చాయి. వాటిని పరిశీలించిన ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులతో చర్చించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, అదే విధంగా ప్రతి ఉద్యోగి పని చేయాలన్నారు. ప్రజా సమస్యలకు ఖచ్చితమైన పరిష్కారం అందించాలన్నారు. మండల పరిధి నుంచి 100 అర్జీలు తన దృష్టికి రావడం అనేది అధికారుల అలసత్వం తెలియజేస్తుందన్నారు. వెంటనే పరిష్కారం అయ్యే సమస్యకు కూడా రోజుల తరబడి ప్రజలను తిప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు వెంటనే ఎందుకు పరిష్కారం చూపరని అధికారులను ప్రశ్నించారు. జూన్ 5న తిరిగి చుండూరులో వేదిక ఏర్పాటు చేస్తామని అప్పటికి సమస్యలన్నింటిని పూర్తిగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందన్నారు. సమస్య పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ తిరిగి అదే సమస్య తన దృష్టికి వస్తే సంబంధించిన అధికారుల విషయంలో వేరుగా ఆలోచన చేయాల్సిన అవసరం వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుదీప, తహసీల్దార్ నాగరాజారావు, ఇతర శాఖల అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, టీడీపీ నాయకులు శివారెడ్డి, యల్లారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరిహారం చెక్కు అందజేత

కొల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు గురై మృతి చెందిన మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు రూ.4 లక్షలు చెక్కు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ నెల 4వ తేదీన కృష్ణా జిల్లా మొవ్వ మండలం క్రోసూరు గ్రామానికి చెందిన మాతంగి సుప్రదీప్ ఉపాధి పనుల కోసం కొల్లూరు మండలం గాజుల్లంక వద్ద కృష్ణానది గాలు మార్గంలో నుంచి వస్తుండగా పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. మృతుని కుటుంబానికి జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ పరిహారం కింద అందించిన చెక్కును ఎమ్మెల్యే ఆనందబాబు గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కలెక్టర్ ప్రశంసించారు. విద్యార్థులకు అవార్డులు, జ్ఞాపికలను స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం అందజేశారు. అనంతరం విద్యార్థులకు శాలువాలు కప్పి ఆయన సత్కరించారు. 9 వసతిగృహాలు, పాఠశాలలోని 19మంది విద్యార్థినీ, విద్యార్థులు 500 నుంచి 589 మార్కుల వరకు సాధించటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో భాగంగా రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమాధికారులను కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారిణి శివలీల, సహాయ బీసీ సంక్షేమాధికారులు రాజేష్ దాసు, అరుణమ్మ, శారదారాణి, హెచ్‌డబ్ల్యువోలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవార్డులు, జ్ఞాపికలను అందజేసిన కలెక్టర్ జె.వెంకటమురళి

117 జీవోను ఉపసంహరించాలి : ఏపీటీఎఫ్

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగాన్ని అతలాకుతలం చేస్తున్న 117 జీవోను ఉపసంహరించాలి అని ఏపీటీఎఫ్ నాయకులు అన్నారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ పాఠశాలను 9 రకాలుగా నెలకొల్పటం అప్రజాస్వామికమని 4 దశల విధానాన్ని అమలు చేయాలని విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతిప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు షేక్ జిలానీ మాట్లాడుతూ 12వ పీఆర్సీని వెంటనే నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని, ఆర్థిక బకాయిలను చెల్లించాలని కోరారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం మాట్లాడుతూ విద్యారంగాన్ని కాపాడుకోకపోతే పేద పిల్లలు నిరక్ష్యరాస్యతకు గురవుతారని, ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను పటిష్టం చేయటానికి ఉపాధ్యాయులు ఉద్యమించాలని కోరారు. ఈధర్నాలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగాంజనేయులు, వై.చెన్నకేశవులు, సి.శ్రీనివాస్, తేలప్రోలు శ్రీనివాసరావు, కిషోర్, విజయబాబు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్‌లు అందజేత

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు మంజూరైన స్పోర్ట్స్ కిట్‌లను శుక్రవారం వ్యాయామ ఉపాధ్యాయులకు కలెక్టర్ జె.వెంకటమురళి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె.పాల్ కుమార్ పాల్గొన్నారు.

పేద మహిళకు బియ్యం పంపిణీ

కర్లపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి) :అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం ఇందిరానగర్‌లో ఒక నిరుపేద మహిళకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు, గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా, షేక్ మస్తాన్‌వలి, షేక్ ఇబ్రహీం, షేక్ బహదూర్ బాషా, షేక్ సుభానీ, షేక్ ఈసా పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్టు

బాపట్లరూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిని శుక్రవారం వెదుళ్ళపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ తెలిపిన వివరాలు ప్రకారం... బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామానికి చెందిన అంగడి గౌతమ్, మానుపాటి వెంకటేష్, గాజుల కేశవ వ్యసనాలకు బానిసై కుందేరువాగు ఒడ్డున నాటుసారా తయారు చేసి దానిని విక్రయించాలనే ఉద్దేశ్యంతో అర్ధరాత్రి సమయంలో స్టూవర్టుపురం 1వ గ్యాంగ్ చివరన నిలబడి ఉండగా వారిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చటం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమ్మె నోటీసు

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాల సంస్థలో పని చేస్తున్న హమాలీ కార్మికులు శుక్రవారం జిల్లా మేనేజర్‌ను కలిసి ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో హమాలీ కార్మికులందరూ పాల్గొంటున్నారని యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.రత్నరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ఎఫ్‌సీఐ మాదిరిగా వేతనాలివ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ఎస్‌కె.కాలేషావలి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

పిట్టలవానిపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భవనం వారిపాలెం గ్రామపంచాయతీలోని మూల మలుపు వద్ద శుక్రవారం ద్విచక్రవాహనదారుడు ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి తీవ్రగాయాలపాలయ్యాడు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న బుద్దుల ప్రభు, ఇ.రవీంద్ర, నాగేశ్వరరావులకు తీవ్ర గాయాలయ్యాయని చందోలు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించినట్లు చందోలు పోలీసులు తెలిపారు. ఈ విషయమై బుద్దుల కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పేరలి గ్రామానికి తాగునీరు సరఫరా

కర్లపాలెం, మే9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలి పంచాయతీ పరిధిలోని పాతపాలెం, మేకలవారిపాలెంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ఆదేశాలతో మరమ్మతులు చేసి శుక్రవారం తాగునీరును విడుదల చేశామని పంచాయతీ అధికారులు తెలిపారు.



విద్యార్థులకు నగదు బహుమతిని అందిస్తున్న ఎంసీఏ సభ్యులు

విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రేపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి) : విద్యకి పేదరికం అడ్డుకాదని, కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎన్ఆర్ఐ పరుచూరి శ్రీనాథ్ అన్నారు. శుక్రవారం మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ హాలులో పరుచూరి రామకృష్ణయ్య జ్ఞాపకార్థం విద్యలో రాణించే విద్యార్థులైన టి.లాస్య, ఎం.పూర్ణశ్రీనివాసరావుకు ఒక్కొక్కరికి శుక్రవారం రూ.15 వేలు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఏ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు, జీ.బాపారావు, ఎంసీఏ సభ్యులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ రేపల్లె సమితి కార్యవర్గం ఏకగ్రీవం



శ్రీమన్నారాయణ నాగాంజనేయులు బాలాజీ

రేపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) రేపల్లె ఏరియా సమితి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐటీయూసీ రేపల్లె ఏరియా గౌరవాధ్యక్షుడు జీ.బాలాజీ తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. 21 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ రేపల్లె ఏరియా సమితి నూతన అధ్యక్షుడిగా గొట్టుముక్కల శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా పి.నాగాంజనేయులు, ఉపాధ్యక్షులుగా సమ్మెట శ్రీనివాసరావు, యార్లగడ్డ కనకదుర్గ, టి.కుసుమకుమారి, కార్యదర్శులుగా గుమ్మడి నాగమల్లేశ్వరమ్మ, కొలుసు నరేష్, కాగితపు శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా జీ.ఏసుదాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిరంశెట్టి శ్రీనివాసరావు, వర్కింగ్ మహిళా కార్యదర్శిగా పి.జయమ్మ, కోశాధికారిగా టి.పద్మావతిలతో పాటు 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సరస్వతి విద్యామందిర్‌కు పదో తరగతి వరకు అనుమతి

రేపల్లె, మే 9(ఆంధ్రజ్యోతి) : సరస్వతి విద్యామందిర్‌కి 2025-26 విద్యాసంవత్సరం నుంచి 8 నుంచి 10 వరకు తరగతుల ప్రారంభానికి ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ అనుమతులు జారీ చేసిందని స్కూల్ డైరెక్టర్ తొట్టెంపూడి సుభాష్ శుక్రవారం తెలిపారు. ఈ తరగతులు అనుమతి ఇచ్చేందుకు కృషి చేసిన మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్‌కి పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నామమాత్రపు ఫీజుతో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఈ పాఠశాలకు బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. తీరప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

వేమూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని, వివాహ వయస్సు వచ్చేంత వరకు వేచి ఉండాలని అంగన్‌వాడీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయరాణి తెలిపారు. వేమూరులో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకుంటే అనారోగ్యాలకు గురవుతారని తెలిపారు. ఏఎన్ఎం జయమణి మాట్లాడుతూ, కౌమార దశలో బాలికలు తగు జాగ్రత్తలు పాటించాలని, పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి, కార్యకర్తలు మాధవి, రాజకుమారి, రాజ్యలక్ష్మి, బాలికలుపాల్గొన్నారు.

మేకల యజమానికి న్యాయం చేయాలి

కొల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో శుక్రవారం మేకల యజమాని కారుమూరి వెంకటరామయ్య కుటుంబాన్ని సీపీఎం నాయకులు పరామర్శించారు. పార్టీ నాయకుడు బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ, మేత కోసం పొలాల్లో ఉన్న మూగజీవాలు పిడుగుపాటుకు గురై 23 మృతి చెందాయని, మరో 9 మూగజీవాలు తీవ్రంగా గాయపడినట్లు మేకల యజమాని పేర్కొన్నారన్నారు. యజమానికి సుమారు రూ.5 లక్షలు నష్టం జరిగిందని, పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ శాఖాధికారులు స్పందించి మూగజీవాలు కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. సీపీఎం నాయకులు అగస్టీన్, రాంబాబు, సాంబశివరావు, కె.సుబ్బారావు ఉన్నారు.

నేడు వ్యవసాయ పరికరాల పంపిణీ

చెరుకుపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఉదయం నియోజకవర్గంలోని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదగా జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీగంగాధర్ తెలిపారు.



నిజాంపట్నం రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్న చిత్రం

రేపల్లె-నిజాంపట్నం రహదారి పనులు ప్రారంభం

● రూ.9.50 కోట్ల నిధులు మంజూరు

రేపల్లె, మే 9(ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో ఎన్నో ఏళ్ళగా ఎదురుచూస్తున్న రేపల్లె-నిజాంపట్నం రహదారి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టిసారించి ఈ రహదారి నిర్మాణం కోసం రూ.9.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రేపల్లె నుంచి నిజాంపట్నం వెళ్ళాలంటే రహదారంతా గుంతలమయంగా మారి నరకయాతన అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో రేపల్లె-నిజాంపట్న రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం కావటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇసుకపల్లి నుంచి పల్లపట్ల వరకు డబుల్‌లైన్ తారు రోడ్డు నిర్మాణం జరగనున్నది. పల్లపట్ల గ్రామంలో కిలోమీటరున్నర డబుల్ లైన్ సీసీ రహదారిని నిర్మించనున్నారు. అక్కడ నుంచి నిజాంపట్నం వరకు డబుల్ లైన్ తారురోడ్డు నిర్మాణం జరగనున్నది. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారి గుంతలన్నా పూడ్చాలంటూ ఆయా గ్రామాల ప్రజలు నిరసనలు, ధర్నాలు చేసి మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం రావటంతో రహదారి పనులు ప్రారంభించటంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోటిన్నర వ్యయంతో శివాలయం పునర్నిర్మాణం

● రేపు పునఃప్రతిష్ఠ కార్యక్రమం

● ఐదు రోజుల దీక్షతో ప్రారంభమైన క్రతువు



సుందరంగా నిర్మించిన మల్లేశ్వరాలయం

వేమూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో ఉన్న పురాతనమైన శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం దెబ్బతినడంతో అదే స్థానంలో కోటిన్నర వ్యయంతో ఆలయాన్ని అతి సుందరంగా పునర్నిర్మించారు. దేవదాయ శాఖ, భక్తుల ఆర్థిక సహాయ సహకారాలతో ఆలయ వాస్తురీత్యా నిర్మాణాన్ని పూర్తి చేశారు. నూతన ఆలయంలో ఆదివారం ఉదయం 6 గంటల 42 నిమిషాలకు పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. దేవదాయ శాఖ ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఐదు రోజుల దీక్షతో ప్రతిష్ఠా క్రతువును ప్రారంభించారు. ఆలయంలో శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, పరివార దేవతలు, ప్రత్యేకంగా నిర్మించిన ఉప ఆలయాలలో ఆంజనేయస్వామి నవగ్రహాలు ప్రతిష్ఠతో పాటుగా విగ్రహ యంత్రములు, శిఖరములు జీవధ్వజము ప్రతిష్ఠించి మహా కుంభాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఆగమ పండితులు పొత్తూరు సత్యనాగ మృత్యుంజయ శర్మ బ్రహ్మోత్సవాలలో ప్రారంభమైన క్రతువులో భాగంగా శుక్రవారం ఉదయం విశేషంగా సోమనాథ పూజ యోగి యాగేశ్వర పూజ చతుర్థకాల యాగశాల అర్చన విశేష హోమాలు జరిపి క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం నిర్వహించారు. శనివారం ఉదయం చందనాధివాసం, సామూహిక కుంకుమ పూజలు జరుపుకున్నారు. ఆదివారం ఉదయం ప్రతిష్ఠ అనంతరం శాంతి కల్యాణ మహోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమం జరిపి 11.30 గంటల నుంచి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా కమిటీల ఏర్పాటు

● ఎమ్మెల్యే ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 9 (ఆంధ్రజ్యోతి) : పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామ పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. భట్టిప్రోలులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం మండల పార్టీ కన్వీనర్ వాకా శేషుబాబు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, పార్టీ నాయకులు క్రియాశీల సభ్యులే సమష్టిగా సమన్వయంతో కమిటీల నియామకాలు పూర్తి చేయాలన్నారు. కమిటీ ఏర్పాటులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలన్నారు. కమిటీలో చోటు దక్కని వారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, అనంతరం ఏర్పడే కమిటీల్లో ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో కొందరు నాయకులు తమ గ్రామాలకు చెందిన కమిటీలకు రూపొందించిన పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, కె.వెంకటేశ్వరరావు, వేములపల్లి జగన్నాధం, కర్ణ శ్రీనివాసరావు, బట్టు మల్లికార్జునరావు, సుందరరావు, శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు టీడీపీ మండల స్థాయి విస్తృత సమావేశం

అమృతలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం శనివారం జరుగుతుందని వేమూరు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో గ్రామ కమిటీలు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిల నియామకం గురించి చర్చించడం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు విధిగా హాజరుకావాలని కోరారు.



భోజన కుతూహలం

పల్లేరుతో భేషైన ఆరోగ్యం..!

పల్లేరు మనకు చాలా ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటుంది. చాలా మంది దీన్ని పిచ్చి మొక్క అనుకుంటారు. కానీ పల్లేరు కాయలు, ఆకుల వల్ల అమితమైన ప్రయోజనాలున్నాయని ఆయుర్వేద గ్రంథాలు చెబుతున్నాయి.



పల్లేరును సంస్కృతంలో 'గోక్షురం' అని పిలుస్తారు. 'గోక్షురం' అంటే శరీరానికి చల్లదనాన్ని, బలాన్ని, పుష్టిని అందించేదని అర్థం. పల్లేరుకాయలు చిన్నవి, పెద్దవి అని రెండు రకాలుగా ఉంటాయి. పెద్ద పల్లేరుకాయల్ని 'గజపల్లేరు' అంటారు. ఈ కాయను రెండుగా చీలిస్తే- లోపల భాగమంతా జిగురుగా ఉంటుంది. ఈ జిగురు మన శరీరానికి ఎంతో ఉపకరిస్తుంది. కేవలం జిగురు మాత్రమే కాదు, పల్లేరు ఆకులు, కాయలు, వేర్లు... ఇవన్నీ త్రిదోష సమతుల్యతను కలిగిస్తాయి. చిన్న పల్లేరు కాయలకు కూడా ఈ తరహా గుణాలే ఉంటాయి. పల్లేరు కాయలు, ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.

- పల్లేరు ఆకులను ఎండబెట్టి వాటితో ఉదయాన్నే టీ చేసుకొని తాగితే చర్మానికి కాంతి వస్తుంది.
- పల్లేరు ఆకులను సలాడ్‌లో వేసుకొని తింటే మూత్రంలో మంట తగ్గుతుంది. మూత్రనాళంలోని రాళ్లు కరిగిపోతాయి.
- పల్లేరు కాయలను ఎండబెట్టి కషాయంగా చేసి తాగితే హార్మోన్ల అసమతౌల్యం కలిగే రకరకాల సమస్యలు తగ్గుతాయి. యువతులను వేధించే 'పోలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్' (పీసీఓడీ)కు కూడా ఇది మంచి పరిష్కారం.
- పల్లేరు కాయలు స్ఫటికం మాదిరిగా ముళ్లు ముళ్లుగా ఉంటాయి. ఈ కాయలలోని గుజ్జును ఏదో ఒక రూపంలో తీసుకుంటే మూత్రపిండాల్లో పేరుకున్న రాళ్లు కరుగుతాయి.
- పల్లేరు ఆకులు, కాయలు, వేర్లను ఎండబెట్టి... పొడి చేసి దాన్ని కూరల్లో వాడుకుంటే రకరకాల ప్రయోజనాలు ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

మనలో చాలామంది తాటి ముంజలను ఇష్టంగా తింటూ ఉంటారు. వీటితో రకరకాల వంటలు కూడా చేసుకోవచ్చు. తాటి ముంజలను సరికొత్తగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

తాటి ముంజలతో మురిపించే రుచులు

తాటి ముంజలతో లెమనేడ్

కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, నిమ్మరసం- రెండు చెంచాలు, పంచదార- మూడు చెంచాలు, ఐస్ క్యూబ్స్- 4, ఉప్పు- చిటికెడు, నల్ల ఉప్పు- చిటికెడు, నీళ్లలో నానబెట్టిన సబ్జాగింజలు- రెండు చెంచాలు, పుదీనా ఆకులు రెండు

జాగ్రత్తలు

- లేత తాటి ముంజలు తీసుకుంటే ఈ పానీయం మరింత రుచిగా ఉంటుంది.
- ఇందులో నానబెట్టిన చియా గింజలు కూడా వేసుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలను చిన్న ముక్కలుగా తరగాలి.
- మిక్సీలో తాటి ముంజల ముక్కల్లో సగం, నిమ్మరసం, పంచదార, రెండు ఐస్ క్యూబ్‌లు, ఉప్పు, నల్ల ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి.
- ఒక సర్వింగ్ గ్లాస్‌లో సబ్జా గింజలు, మిగిలిన తాటి ముంజల ముక్కలు, రెండు ఐస్ క్యూబ్‌లు, మిక్సీ గిన్నెలోని మిశ్రమం వేయాలి. ఒక గ్లాసు చల్లని నీళ్లు పోయాలి. పైన పుదీనా ఆకులు వేసి సర్వ్ చేయాలి.

వీటిలో నీరు అధికంగా ఉంటుంది కాబట్టి శరీరానికి తగినంత తేమ అందుతుంది. నిర్జలీకరణ సమస్యలు రావు. తాటి ముంజలలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.



తాటి ముంజల పాయసం

కావాల్సిన పదార్థాలు

పాలు- ఒక లీటరు, పంచదార- ముప్పావు కప్పు, లేత తాటి ముంజలు- ఆరు, యాలకుల పొడి- అర చెంచా, బాదం పలుకులు- రెండు చెంచాలు, జీడి పప్పు పలుకులు- రెండు చెంచాలు, గులాబీ నీరు- ఒక చెంచా

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి వీలైనంత సన్నగా తరగాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి పెద్ద మంట మీద పావుగంటసేపు మరిగించాలి. పాలను గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు చిక్కగా అయ్యాక పంచదార పోసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత పాలను స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. ఫ్రిజ్‌లో రెండు గంటలు ఉంచాలి. తరవాత ఈ చల్లటి పాలలో తాటి ముంజల తరుగు, గులాబీ నీళ్లు, బాదం పలుకులు, జీడిపప్పు పలుకులు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. తరవాత చిన్న పింగాణీ గిన్నెల్లో పోసి సర్వ్ చేయడమే. ఈ పాయసం రుచి అద్భుతంగా ఉంటుంది.



జాగ్రత్తలు

- పాయసం చిక్కగా ఉండాలనుకుంటే... చిన్న గిన్నెలో ఒక చెంచా కస్టర్డ్ పౌడర్ వేసి, కొన్ని నీళ్లు పోయాలి. జారుగా కలిపి ఆ మిశ్రమాన్ని మరుగుతున్న పాలలో కలిపితే సరిపోతుంది.
- గులాబీ నీరు అందుబాటులో లేకపోతే నాలుగు రేకుల కుంకుమ పువ్వు వేసుకోవచ్చు.
- పంచదార వద్దనుకుంటే... మరిగిన పాలను స్టవ్ మీద నుంచి దించాక అందులో బెల్లం పొడి కలుపుకోవచ్చు.

తాటి ముంజలలో ఎ, బి, సి విటమిన్లతోపాటు ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం లాంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటు, మలబద్ధకం లాంటి సమస్యలను నివారిస్తాయి. శరీరంలో కణితులు, రొమ్ము క్యాన్సర్ రాకుండా నిరోధిస్తాయి. ముఖం మీద మొటిమలు, మచ్చలు, ముడతలు రాకుండా చేస్తాయి.

తాటి ముంజల కూర



కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఉప్పు- తగినంత, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి- అర చెంచా, జీలకర్ర- పావు చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- పావు కప్పు, నూనె- మూడు చెంచాలు

జాగ్రత్తలు

- తాటి ముంజల్ని మరీ లేతగా, మరీ ముదురుగా కాకుండా మధ్యస్థంగా ఉండేవి తీసుకోవాలి.
- నూనె వేడెక్కిన వెంటనే కొన్ని జీడిపప్పు పలుకులు వేస్తే కూర కమ్మగా ఉంటుంది.
- టమాటా ముక్కలను వీలైనంత సన్నగా తరగాలి. లేదంటే టమాటా పేస్టు వాడుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి ఒక్కోదాన్ని నాలుగు ముక్కలుగా కోయాలి.
- స్టవ్ మీద కడాయి పెట్టి, నూనె వేసి వేడి చేయాలి. తరవాత జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, చిటికెడు ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత తాటి ముంజల ముక్కలు, పసుపు, కారం, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత టమాటా ముక్కలు, ధనియాలపొడి, జీలకర్ర పొడి, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత కడాయిని స్టవ్ మీద నుంచి దించి కూరను వేరే గిన్నెలోకి తీయాలి. ఈ తాటి ముంజల కూర... అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

ఎండాకాలంలో తాటి ముంజలు తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. వడదెబ్బ తగలదు. శరీరంలో పేరుకున్న విషపదార్థాలు తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

మూతల రంగుల్లో మర్మం ఇదే..!



మనం సాధారణంగా బయటికి వెళ్లినప్పుడు లేదా ప్రయాణాల్లో దాహమనిపిస్తే వెంటనే వాటర్ బాటిల్ కొనుక్కుని నీళ్లు తాగేస్తూ ఉంటాం. ఈ బాటిళ్లకు పలు రంగుల మూతలు ఉండడాన్ని చాలామంది గమనించే ఉంటారు. ఈ రంగు మూతలు ఆ బాటిళ్లలోని నీటి గురించి తెలియజేస్తాయంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

నీలం: మనకు తరచుగా లభ్యమయ్యే వాటర్ బాటిళ్లకు నీలం రంగు మూతలు ఉంటాయి. అంటే ఆ బాటిళ్లలోని నీటిని నదులు, చెరువులు లాంటి సహజ వనరుల నుంచి సేకరించి శుద్ధి చేశారని అర్థం. ఈ నీటిలో లవణాలు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందుకే ఈ నీటిని 'మినరల్ వాటర్' అంటారు.

ఆకుపచ్చ: ఇవి కాస్త అరుదుగా కనిపిస్తూ ఉంటాయి. పెద్ద సూపర్ మార్కెట్లలో, షాపింగ్ మాల్స్‌లో, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఇవి లభ్యమవుతాయి. ఆకుపచ్చ మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నది 'ఫ్లేవర్డ్ వాటర్' అని అర్థం. కొన్ని రకాల నేచురల్ ఫ్లేవర్స్‌ను స్వల్ప మోతాదులో కలపడం వల్ల ఈ నీరు ప్రత్యేకమైన రుచితో ఉంటుంది.



నలుపు: నలుపు రంగు మూత ఉన్న వాటర్ బాటిల్స్ కూడా అరుదుగానే కనిపిస్తాయి. వీటి ధర ఎక్కువగా ఉంటుంది. వీటిని సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు కొంటూ ఉంటారు. నల్లని మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి... 'ఆల్కలైన్ కలిపిన నీళ్లు' అని అర్థం. ఈ నీళ్లు తాగితే కడుపులో ఆమ్లత్వం, ఇతర జీర్ణాశయ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో క్షార పదార్థాలు, మినరల్స్ కూడా కలుపుతారు.

తెలుపు: తెల్లని మూత ఉన్న వాటర్ బాటిల్స్ సాధారణంగా అన్ని చోట్లా దొరుకుతూనే ఉంటాయి. వీధి చివరన ఉండే చిన్న కొట్లు, కిరాణా షాపులు, కూల్‌డ్రింక్ షాపులు, బస్టాండ్లలో ఇవి విరివిగా లభ్యమవుతూ ఉంటాయి. తెలుపు మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి 'బాగా శుద్ధి చేసిన నీళ్లు' అని అర్థం. వీటిలో ఎటువంటి మినరల్స్ ఉండవు. కేవలం దాహం తీర్చుకోవడానికి పనికొస్తాయి.

పసుపు, ఎరుపు, గులాబీ రంగులు: పసుపు రంగు మూత ఉంటే ఆ నీళ్లు విటమిన్లు, ఎలక్ట్రొలైట్లు కలిపినవనీ; ఎరుపు రంగు మూత ఉంటే అవి కార్బొనేటెడ్ నీళ్లు అనీ తెలుసుకోవచ్చు. గులాబీ రంగు మూత ఉంటే అది నీటిని గురించి తెలియజేసేది కాదు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు రొమ్ము క్యాన్సర్ గురించి అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినది.

మేకప్

మదర్స్ డే మేకప్

మదర్స్ డే నాడు మనోహరంగా కనిపించాలంటే 30 ఏళ్లు పైబడిన తర్వాత ముఖంలో ప్రతిఫలించే గీతలు, మచ్చలను మేకప్‌తో దాచేయాలి. తోటి తల్లులందరిలో మెరుపులీనుతూ కనిపించడం కోసం... ఇవిగో ఈ ప్రాథమిక మేకప్ చిట్కాలు పాటించండి.

హైడ్రేషన్ కోసం: వేసుకునే మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవడం కోసం ముందుగా చర్మాన్ని సిద్ధం చేయాలి. అందుకోసం ఫేసియల్ సీరమ్‌ను ముఖం మీద అద్దుకోవాలి. ఈ సీరం జిడ్డుగా ఉండకుండా చర్మానికి తేమతో పాటు, సన్‌స్క్రీన్ రక్షణ కూడా అందించేలా ఉండాలి. ఈ సీరమ్ చర్మంలో చక్కగా ఇంకిపోయిన తర్వాతే మేకప్ మొదలు పెట్టాలి.

ద్రవరూప ఫౌండేషన్: ముఖం మీద ఉండే సన్నని గీతల్లో ఇరుక్కుపోయి ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండాలంటే తేలికపాటి ద్రవరూప ఫౌండేషన్ ఎంచుకోవాలి. ఈ రకమైన ఫౌండేషన్ చర్మం మీద పలుచగా పొరలా ఏర్పడి ఆ తర్వాత వేసుకోబోయే కాంపాక్ట్, బ్లష్‌లకు అనువుగా ఉంటుంది. అయితే ఫౌండేషన్‌ను నేరుగా అప్లై చేసుకోకుండా, మొదట ముఖమంతా అక్కడక్కడా చుక్కలుగా అద్దుకుని, ఆ తర్వాత స్పాంజ్‌తో ముఖమంతా పరుచుకునేలా చేయాలి

తడిపిన స్పాంజ్‌తో: ఫౌండేషన్, కన్‌సీలర్‌ల కోసం తడిపి పిండిన మేకప్ స్పాంజ్ వాడుకోవాలి. ఈ పద్ధతితో మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. మరింత సహజసిద్ధంగా కనిపిస్తుంది. అయితే స్పాంజి తేమగా ఉండాలే తప్ప నీరు కారుతూ ఉండకూడదు. అందుకోసం స్పాంజిని గోరువెచ్చని నీటి ధార కింద ఉంచి, గట్టిగా పిండేయాలి.

ద్రవరూప బ్లష్: బ్లష్‌తో అందం రెట్టింపవుతుంది. అయితే అందుకోసం సరైన రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు బ్లష్‌లు, మరీ మెత్తని పౌడర్ రూపంలో ఉండే బ్లష్‌లు ఎబ్బెట్టుగా కనిపిస్తూ, చర్మపు గీతల్లో ఇరుక్కుపోతాయి. కాబట్టి పౌడర్ బ్లష్‌లకు బదులుగా ద్రవరూప బ్లష్‌లు ఎంచుకోవాలి. వీటిని కూడా తడిపి పిండిన స్పాంజితోనే అద్దుకోవాలి.



తులసి ప్రయోజనాలెన్నో!

తులసి మొక్కను మనం పవిత్రంగా భావిస్తాం. దానిని అనునిత్యం పూజిస్తాం. అలాంటి తులసిలో విటమిన్-ఎ, యాంటీ ఆక్సిడెంట్లు తాంటివి పుష్కలంగా



ఉంటాయి. అందుకే తులసి ఆకులను తినడం, తులసి కషాయం, తులసి టీ తాగడం... ఇలా ఏదో ఒక రూపంలో తులసిని తీసుకోవడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేమిటో తెలుసుకుందాం.

- ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున తులసి ఆకులను తినడం వల్ల చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.
- తులసి కషాయం తాగడం వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.
- తులసి ఆకులు తినడం వల్ల గుండె ఆరోగ్యంతో పాటు జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

సెలబ్ ఫిట్

నవయవ్వన సోయగం

తారాజువ్వలా వెండితెర మీదకు దూసుకువచ్చింది. సల్మాన్ లాంటి స్టార్ల సరసన అందంగా ఒదిగిపోయింది. నవయవ్వన కాంతితో యువతరం హృదయ స్పందనై వెలిగింది. పరిశ్రమలోకి వచ్చి పదిహేనేళ్లు దాటినా... నేటికీ అదే మైమరిపించే రూపు... చూపు తిప్పుకోనివ్వని నాజూకు... జాక్వెలిన్ ఫెర్నాండెజ్.



స్వదేశం శ్రీలంక. పుట్టింది బహ్రైన్‌లో. డిగ్రీ... ఆస్ట్రేలియాలోని సిడ్నీ విశ్వవిద్యాలయంలో. ఆమె తండ్రి ఎల్రాయ్ ఫెర్నాండెజ్‌ది శ్రీలంక. తల్లి కిమ్‌ది మలేషియా, కెనడా మూలాలున్న కుటుంబం. శ్రీలంకలో సింహళీస్, తమిళుల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంతో జాక్వెలిన్ తండ్రి దేశం వదిలి బహ్రైన్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అక్కడ ఎయిర్‌హోస్టెస్‌గా పని చేస్తున్న కిమ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన జాక్వెలిన్‌కు అక్క, ఇద్దరు అన్నలు. సిడ్నీ వర్సిటీ నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పట్టా పొందిన ఆమె... కొంత కాలం టీవీ రిపోర్టర్‌గా పని చేసింది. గ్లామర్ ప్రపంచంలోకి రావాలన్న ఆసక్తితో మోడలింగ్ మొదలుపెట్టింది. 2006లో 'మిస్ యూనివర్స్ శ్రీలంక' కిరీటాన్ని దక్కించుకుని, తన దేశం నుంచి 'మిస్ యూనివర్స్'కు పోటీపడింది.

అలా వచ్చి...

మూడేళ్ల తరువాత ఓ మోడలింగ్ ప్రాజెక్ట్ కోసం భారత్‌కు వచ్చిన జాక్వెలిన్... అదే సమయంలో నిర్వహించిన 'అలాదిన్' చిత్రం ఆడిషన్స్‌కు వెళ్లింది. దర్శకుడు సుజోయ్ ఘోష్‌ను ఆమె రూపం ఆకట్టుకుంది. ఇక అప్పటి నుంచి జాక్వెలిన్‌కు భారత్ మరో ఇల్లు అయింది. అలా 2009లో నటిగా తొలి అడుగు వేసిన జాక్వెలిన్... మహేష్‌భట్ 'మర్డర్2'తో మొదటి హిట్ అందుకుంది. సల్మాన్‌ఖాన్ సరసన తెలుగు చిత్రం 'కిక్' రీమేక్‌లో నటించింది. ఆమె కెరీర్‌లోనే భారీ కలెక్షన్లు రాబట్టిన సినిమా అది. తెలుగు, కన్నడల్లో పలు ప్రత్యేక గీతాల్లో మెరిసిన జాక్వెలిన్... ఈ పదిహేనేళ్లలో 35కు పైగా చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం ఆమె చేతులో రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. నటి కావాలన్నది చిన్ననాటి కోరిక. హాలీవుడ్ తారగా వెలిగిపోవాలని కలలు కనేదట. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకుపోతున్న ఆమె జీవితాన్ని 2021లో మనీ లాండరింగ్ కేసు కుదిపేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సుఖేష్ చంద్రశేఖర్ నుంచి ఖరీదైన బహుమతులు అందుకుందన్నది జాక్వెలిన్‌పై ఆరోపణ. ఇది ఆమె కెరీర్‌నే కాదు, జీవితాన్ని కూడా ఎంతో ప్రభావితం చేసింది. కానీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా తిరిగి నిలబడేందుకు ప్రయత్నిస్తోంది. ఇలాంటి ఒత్తిడుల నుంచి తనను రక్షిస్తున్నది, ఆరోగ్యంగా ఉంచుతున్నది ఫిట్‌నెస్ అంటుంది జాక్వెలిన్.

ఆదివారమూ విరామం లేదు...

ఇతర తారలకు భిన్నంగా... జాక్వెలిన్ రోజూ కంటే ఆదివారం వ్యాయామాల కోసం మరింత ఎక్కువ సమయం కేటాయిస్తుందిట. "యోగా, వెయిట్ ట్రైనింగ్, డ్యాన్స్‌లు కలగలిపి ఆదివారం నా వర్కవుట్ రెండు నుంచి మూడు గంటలపాటు తీవ్రంగా సాగుతుంది. కొంతమంది అంటుంటారు... 'నాక్కూడా నీలాంటి దృఢమైన ఆకృతి కావాల'ని. ఇది ఒక్క రోజులో వచ్చింది కాదు. కొన్నేళ్లుగా ఇదే రూపాన్ని కాపాడుకొంటూ వస్తున్నా. క్రమం తప్పని ఆహార నియమాలు పాటిస్తున్నా. నా రూపు అథ్లెట్లను తలపించాలని కోరుకొంటాను. ఎప్పుడూ దృఢంగా, ఉల్లాసంగా, చురుగ్గా ఉండటానికి ప్రయత్నిస్తాను. అవసరమైనప్పుడు కావల్సినంత విశ్రాంతి తీసుకొంటాను" అంటున్న ఈ ముద్దుగుమ్మ తరచూ తన ఫిట్‌నెస్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి, అభిమానులకు ప్రేరణ కలిగిస్తుంటుంది. ఇన్‌స్టాలో ఏడు కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారంటే ఆమె క్రేజ్ ఏస్థాయిలో ఉందో వేరే చెప్పనక్కర్లేదు.

- జాక్వెలిన్ వ్యాయామాల్లో ప్రధానంగా యోగ ఉంటుంది.
- ఉదయం లేవగానే జాగింగ్, రన్నింగ్‌తో కూడిన కార్డియో తరువాత యోగా, పిలెట్స్ స్ట్రెంత్ ట్రైనింగ్
- రోజూ ఒకటే రకం వర్కవుట్స్‌తో ఆసక్తి తగ్గుతుంది. అందుకని తనను తాను ఉత్సాహపరుచుకోవడానికి ఎప్పటికప్పుడు కొత్త కొత్త లక్ష్యాలు నిర్దేశించుకొంటుంది.
- వ్యాయామాలను ఉత్సాహభరితంగా మార్చేందుకు పోల్‌డ్యాన్స్, ఏరియల్ సిల్క్ ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంది. పోల్ డ్యాన్స్ తనలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా నింపిందో, శరీరాన్ని మరింత దృఢంగా ఎలా మార్చిందో వివరిస్తూ ఆ మధ్య ఇన్‌స్టాలో ఒకపోస్టు పెట్టింది జాక్వెలిన్.

- తెల్లవారుజామును ఐదు గంటలకే జాక్వెలిన్ దినచర్య మొదలవుతుంది.
- ఉదయం లేవగానే తేనె, నిమ్మ రసం కలిపిన గ్లాసుడు గోరువెచ్చని నీరు
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఉడకబెట్టిన గుడ్లు, తాజా పండ్లు, గ్రీన్ టీ.
- మధ్యాహ్న భోజనంలో పప్పుతో బ్రౌన్ రైస్, వెజిటబుల్, ఫ్రూట్ సలాడ్‌లు. వీటితోపాటు పిండి, పీచు పదార్థాలు, పోషక విలువలు పుష్కలంగా ఉండే క్వినోవా ఆమె మెనూలో తప్పనిసరి.
- అలాగే సలాడ్‌లు, వంటల్లో రెడ్, యల్లో క్యాప్సికమ్, చిలకడదుంపలు చేరతాయి.
- ఇంటర్మిటెన్ ఫాస్టింగ్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. తీపి పదార్థాలకు దూరంగా ఉంటుంది.
- రాత్రిపూట తేలికపాటి భోజనం. సాధ్యమైనంతవరకు రాత్రి ఏడు గంటలకల్లా డిన్నర్ ముగిస్తుంది.



కాకర చేదు తగ్గాలంటే!

కాకరకాయలో ఎన్నో పోషకగుణాలు ఉన్నాయి. కానీ చేదుగా ఉంటుందని చాలామంది దానితో చేసే వంటలను ఇష్టపడరు. అయితే చిన్న చిన్న చిట్కాలు పాటించి కాకరకాయ చేదును తగ్గించవచ్చు. అవేంటో తెలుసుకుందాం!



- కాకరకాయపైన ఉండే గరుకు భాగాన్ని తొలగించేయాలి. దీని వల్ల సగం చేదు తగ్గుతుంది.
- కాకరకాయ ముక్కలకు ఉప్పు రాసి 20-30 నిమిషాల ఉంచి తరువాత ఆ ముక్కలను నీళ్లతో మూడు నాలుగు సార్లు శుభ్రంగా కడగాలి. దీని వల్ల చేదు కూడా తగ్గుతుంది.
- వేడి నీటిలో ఉప్పు వేసి అందులో కాకరముక్కలను నానబెట్టినా చేదును తగ్గించవచ్చు.
- కాకరకాయలో విత్తనాలు తీసివేయడం వల్ల కూడా చేదు తగ్గుతుంది.
- కాకర ముక్కలకు పెరుగు రాసి గంటసేపు పక్కన పెడితే చేదు చాలావరకూ తగ్గిపోతుంది.

12లోపు మ్యూటేషన్ చేయించుకోవాలి

పంగులూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వే జరుగుతున్న కొండమూరు గ్రామంలో ఈ నెల 12వ తేదీలోగా రైతులు తమ భూములు మ్యూటేషన్ పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ సింగారావు ఒక ప్రకటనలో కోరారు. కొండమూరు గ్రామంలో ఫేజ్-2 కింద రీసర్వే చేపట్టినట్లు తెలిపారు. చనిపోయిన ఇతరుల కింద నమోదైన భూములు, కొనుగోలు ద్వారా సంక్రమించిన భూములు, అనుభవసాగులో ఉండి రికార్డులలో పేరు నమోదుకానివారు తమ భూములు నిర్ణీత వ్యవధిలో మ్యూటేషన్ చేయించుకోవాలన్నారు. 10, 11 తేదీలలో వీఆర్వోతో పాటు సిబ్బంది కొండమూరు సచివాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.


నేటినుంచి భీమలింగేశ్వర స్వామి వార్షికోత్సవం

పంగులూరు, మే 9(ఆంధ్రజ్యోతి) : పంగులూరులోని శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయ 21 వార్షిక మహోత్సవం 10 నుంచి 13వ తేదీ వరకు జరుగుతుందని ఈవో శ్రీనివాసరావు చెప్పారు. 10వ తేదీ సాయంత్రం 7గంటలకు విఘ్నేశ్వర పూజతో వార్షికోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం, 7 గంటలకు రాయబారం, 8 గంటలకు స్వామి కల్యాణోత్సవం జరుగుతందని పేర్కొన్నారు. 12వ తేదీ తిరునాళ్ల, 7 గంటలకు శ్రీ రాస భారతీయ కళాక్షేత్రం అద్దంకి వారి కోలాట ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. 13వ తేదీ పూజా కార్యక్రమాలు, పూర్ణాహుతి, అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఉంటుందని వివరించారు. మంగళవారం రాత్రి శ్రీ సాయి నాట్య కళాభారతి, యస్.సరస్వతి శిష్య బృందం ఒంగోలు వారిచే కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

12న కడవకుదురులో ట్రాక్టర్ రివర్స్ పోటీలు

చినగంజాం, మే 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామదేవత పోలేరమ్మతల్లి తిరునాళ్లను పురస్కరించుకొని ఈ నెల 12వ తేదీ ఉదయం 9గంటలకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విజేతలకు బహుమతులు వరుసగా రూ.5,116, రూ.3,116, రూ.2,116 అందజేయనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రెండు రూపాయిలు, తుది నిర్ణయం కమిటీ వారిదేనని వివరించారు. వివరాలకు 9381797620, 9010324747, 9666377546, 9505272650, 7013806905 సెల్ నెంబర్లలో సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

కలెక్టర్ సేవలు ఎనలేనివి



కలెక్టర్ మురళీను సత్కరిస్తున్న ఏడీ నాగమల్లేశ్వరరావు

చీరాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో, పథకాల అమలు తీరు తెన్నులో జిల్లా కలెక్టర్ వెంకటమురళీకి ప్రత్యేక శైలి ఉందని, ఆయన సేవలు ఎనలేనివని జిల్లా హ్యాండ్లూమ్స్ ఏడీ కిలారి నాగమల్లేశ్వరరావు చెప్పారు. గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ ఉత్తమ బంగారు అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా హ్యాండ్లూమ్స్ ఏడీ కలిసి దుశ్శాలువాలతో ఘన సత్కారం అందించారు.

రోడ్ల మరమ్మతులను పర్యవేక్షణ చేయరా..

బాగున్న మార్జిన్లను చెడగొడుతుంటే ఏమి చేస్తున్నారంటూ ఆర్ అండ్‌బీ డీఈపై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి రవికుమార్

రూ.50 కోట్లతో రోడ్ల అభివృద్ధి

అద్దంకి నియోజకవర్గంలో పలు రహదారులకు మోక్షం



తారు రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, మే 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల మరమ్మతుల సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకుండా పనులు ఎలా చేస్తారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆర్అండ్‌బీ డీఈ నరసింహారావుపై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని గోవాడకు వచ్చిన మంత్రి రవికుమార్ దృష్టికి శింగరకొండపాలెం-అంబడిపూడి ఆర్ అండ్‌బీ రోడ్డు మరమ్మతులను ఆయన పరిశీలించారు. ఆ సమయంలో గ్రామస్తులు మాట్లాడుతూ మార్జిన్లు గతంలో పటిష్టంగా ఉండగా, ప్రస్తుతం ఎక్స్‌కవేటర్‌తో తవ్వటంతో బలహీనంగా మారుతున్నాయని, వర్షాకాలం కోతకు గురవుతాయని చెప్పటంతో మంత్రి వెంటనే ఆర్అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్‌లో డీఈ పొంతన లేకుండా సమాధానం చెప్పటంపైనా అసహనం వ్యక్తం చేశారు. రోడ్ల పనులు జరిగే సమయంలో కచ్చితంగా అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా చూడాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో దమ్ము చక్రాల ట్రాక్టర్లు తారురోడ్లపై తిరగకుండా ఆయా గ్రామాల ప్రజలే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం నామ్ రోడ్డు నుంచి గోవాడ వరకు సుమారు 1.20 కోట్ల రూపాయల ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో జరుగుతున్న తారురోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 50 కోట్ల రూపాయలతో తారు రోడ్ల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఇప్పటికే 14.56 కోట్ల రూపాయల ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో 11 రోడ్లు, 9.85 కోట్ల రూపాయల నాబార్డు నిధులతో శాంతినగర్-ఏలేశ్వరవారిపాలెం, కొప్పెరపాడు-జమ్మలమడక రోడ్లకు నిధులు మంజూరయ్యాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి 14 పనులకు సంబంధించి 23.85 కోట్ల రూపాయలు త్వరలో నిధులు మంజూరు కానున్నాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని రోడ్లను వచ్చే నాలుగేళ్లలో తారురోడ్లుగా మార్చనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఐయూ డీఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

నాపై సీఐడీ విచారణ చేయించాలి

గతంలోనే నేను చీరాల అసెంబ్లీ అభ్యర్థిగా టీడీపీ నుంచి బరిలోకి

రాజకీయ పరిణామాల నేపథ్యంలో గత ఎన్నికల్లో వైసీపీకు మద్దతు

తిరిగి టీడీపీ అధిష్టానం కోరిక మేరకే పార్టీ తీర్థం

ఆమంచిపై పలు ఆరోపణలు

విలేకరుల సమావేశంలో మునిసిపల్ చైర్మన్ జంజనం



ఆమంచిపై గతంలో ప్రచారం నిర్వహించిన కరపత్రాలను ప్రదర్శిస్తున్న మునిసిపల్ చైర్మన్ జంజనం

చీరాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధికే గానీ అవినీతికి చోటులేకుండా పాలన సాగించానని, కొంత మంది కావాలనే తనపై అవినీతి ఆరోపణలు చేసి అవిశ్వాసం పెట్టారని వెంటనే తనపై సీఐడీ, సీబీసీఐడీ, విజిలెన్స్ అధికారులు విచారణ చేయాలని మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం చైర్మన్ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలోనే ఆమంచి సాగించిన ఘోరాలను కరపత్రాల ద్వారా ప్రచారం చేసినట్లు గుర్తు చేశారు. అందుకు సంబంధించిన కరపత్రాలను సైతం ప్రదర్శించారు. మరొక వైపు కరణం బలరామకృష్ణమూర్తి చీరాల ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పలు మార్లు పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించుకోనివ్వకుండా ఆమంచి కవ్వింపులకు పాల్పడినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బలరాంకు మద్దతు తెలిపామని, తనపై కక్ష బూని చైర్మన్ పదవి నుంచి తొలగించేందుకు ఆమంచి ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు. అవిశ్వాసం అధిష్టానం ఆదేశమని, ఎమ్మెల్యే కొండయ్యతో సానుకూలంగా, వివాదాలు లేకుండా ప్రయాణం చేస్తానని జంజనం చెప్పారు. గతంలోనే తాను టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసిన సందర్భాన్ని గుర్తు చేశారు. సహచర కౌన్సిలర్లతో భేదాభిప్రాయాలు లేవన్నారు. చీరాల్లో టీడీపీకు ఆమంచి కృష్ణమోహన్ తీరని ద్రోహం చేశారని, టీడీపీ తీర్థం పుచ్చుకునే ఆ పార్టీని నిర్వీర్యం చేశారని జంజనం ఆరోపించారు.

ముక్తేశ్వరంలో ఈదురు గాలులు

పడిపోయిన రేకుల షెడ్లు, విద్యుత్ స్తంభాలు

రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం అంటున్న బాధితులు



ముక్తేశ్వరంలో ఈదురు గాలులకు పడిపోయిన రేకుల షెడ్డు



గాలి ప్రభావానికి పడి పోయిన విద్యుత్ స్తంభాలు

బల్లికురవ, మే 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో గురువారం రాత్రి ఈదురు గాలి భారీ వర్షం భీబత్సం సృష్టించింది. రెండు గంటల మేర వీచిన గాలుల ప్రభావానికి రెండు రేకుల షెడ్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అందిన సమాచారం మేరకు... ముక్తేశ్వరం రైస్ మిల్లు సమీపంలో ఉన్న తోట అంకమ్మరావు సుమారు రూ.4 లక్షలు వెచ్చించి ఇటీవల పశువులకు రేకుల షెడ్డు వేశారు. ఈదురు గాలి ప్రభావానికి షెడ్డు మొత్తం నేలమట్టమైంది. ఇదే గ్రామంలో సూరేపల్లిరోడ్డులో ఉన్న రావువారి పోతురాజు వేసుకొన్న రేకుల షెడ్డు కూలిపోయింది.

ప్రమాద సమయంలో షెడ్డులో ఎవరూ లేరు. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చినగంజాం, మే 9(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.పాపారావు, రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీనివాసరెడ్డిలు చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ చినగంజాం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ సాటిన విద్యార్థులకు గౌరవ పురస్కారాలు అందజేశారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో మండల పరిధిలోని కేజీబీవీ, పెదగంజాం, రాజుబంగారుపాలెం, చినగంజాం, పెదపల్లెపాలెం, కడవకుదురు, అడవీధిపాలెం జడ్పీ పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన 14 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ముందుగా యూటీఎఫ్ వ్యవస్థాపకులు దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి.భిక్షాలు, మండల ప్రధాన కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, ఉపాధ్యక్షులు సీహెచ్.వెంకట్, జిల్లా కౌన్సిలర్లు పీ పోతురాజు, జీ అంకమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం సుమాంజలి, పెదగంజాం జడ్పీ పాఠశాల హెచ్ఎం డీ నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్ నరసింహారావు, ఆర్ పోతురాజు, ఎ నరసింహారావు, కేవీ సుబ్రమణ్యం, యూ సాంబశివరావు, వై.రామాంజనేయులు, సీఆర్పీ సురేంద్ర పాల్గొన్నారు.

12న త్రివిక్రమ అగస్తేశ్వరస్వామి ఆలయంలో పూజలు

చెరుకూరు(పర్చూరు), మే 9 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో వేంచేసిఉన్న శ్రీ త్రివిక్రమ, అగస్తేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 12వ తేదీన జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి బి.నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10న బలిహరణోత్సవాల అనంతరం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. 11న స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కారంచేడు/పర్చూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో ఝాన్సీ చెప్పారు. శుక్రవారం కారంచేడు పంచాయతీ కార్యాలయం సమీపంలోని గ్రామ సచివాలయంలో వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులతో పాటు ప్రోత్సహించే వారు కూడా శిక్షార్హులేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోవటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ హిమబిందు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌తో సమస్యలకు వేగవంతంగా పరిష్కారం

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా దర్బార్‌తో ప్రజా సమస్యలు నేరుగా తెలుస్తున్నాయని, తద్వారా పరిష్కారం వేగవంతంగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా 750 అర్జీలు స్వీకరించారు. ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పూజలు

ప్రజా సేవా కార్యక్రమాలతో పాటు, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఎమ్మెల్యే కొండయ్య బాల కొండమ్మ దంపతులు వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక గొల్లపాలెంలోని శివాలయంలో కుమారులు నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్, యువనాయకులు గౌరీ అమమర్నాథ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చీరాలను కొండయ్య మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారు

రిటైర్డ్ ఐపీఎస్ జేడీ లక్ష్మీనారాయణ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కొండయ్య మోడల్‌గా తీర్చిదిద్దుతారని రిటైర్డ్ ఐపీఎస్ జేడీ లక్ష్మీనారాయణ చెప్పారు. శుక్రవారం వేటపాలెం మండలం రామన్నపేటలో డాక్టర్ పొగడదండ రవికుమార్‌కు చెందిన హోరిజన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా ఇరువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. ఈసందర్భంగా జేడీ చీరాల - పేరాల ఉద్యమం, గాంధీజీకు చీరాలతో ముడిపడి ఉన్న అంశాలు, వేటపాలెం గ్రంథాలయం వంటి ప్రముఖ అంశాలను వివరించారు. టీడీపీ కూటమి అధికారం చేపట్టిన ఏడాదిలోనే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, తిరిగి నాలుగేళ్లలో ఒక్కసారైన ఏడో ఒక అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి హాజరవుతానని జేడీ చెప్పారు.



పూర్వపుజేడీ లక్ష్మీనారాయణతో ఎమ్మెల్యే కొండయ్య

అభివృద్ధి పనులకు ప్రజలు మంత్రముగ్ధులు

రాష్ట్రంలో టీడీపీ కూటమి అభివృద్ధి పనులు చూస్తున్న ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. మునిసిపాలిటీలోని 20, 21, 22 వార్డులకు చెందిన 200 కుటుంబాలు క్యాంపు కార్యాలయంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే, నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టరు మహేంద్రనాథ్ పార్టీ కండువా కప్పి స్వాగతించారు. గతంలో జగన్ ప్రభుత్వం చేసిన దారుణాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లారీ ఢీకొనడంతో కూలీ మృతి

అవీఇవీ

పొట్టకూటికి వెళుతూ అనంత లోకాలకు

విగతజీవిగా ఉన్న భర్తను చూసి కన్నీరుమున్నీరైన భార్య

చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద మిన్నంటిన రోదనలు



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుమారులు(ఇన్‌సెట్లో) సురేష్(ఫైల్)

చీరాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే... స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన కుంచాల సురేష్(35), శ్రావణి దంపతులు. వీరికి ముగ్గురు కుమారులున్నారు. సురేష్ రోజువారీ కూలీతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన తన్నీరు సురేష్‌తో కలిసి కుంచాల సురేష్ ద్విచక్రవాహనంపై కఠారిపాలెంలో బేల్దారీ పని కోసం బయలుదేరారు. ఈక్రమంలో మన్నం అపార్ట్‌మెంట్ వద్దకు రాగానే జాతీయ రహదారిలో ట్రాఫిక్ ఉండటంతో బైక్‌ను నిదానం చేశారు. అదే సమయంలో చీరాల పట్టణంలో ఫ్యాన్సీ స్టోర్ లోడు దించి విజయవాడకు వెళుతున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న కుంచాల సురేష్ మాత్రమే తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స కోసం గుంటూరుకు సిఫార్సు చేశారు. బంధువులు అంబులెన్స్‌లో ఎక్కిస్తుండగానే తుదిశ్వాస విడిచాడు. సమాచారం అందుకున్న రెండవ పట్టణ పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

సాయంత్రం ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్తానని చెప్పి...

పనికి వెళ్లి పెందల కడనే వస్తా.. ఎగ్జిబిషన్‌కు వెళదామని కుంచాల సురేష్ ఉదయాన్నే చెప్పి పనికి వెళ్లాడు. అలా వెళ్లిన గంట తరువాత చీరాల ఏరియా వైద్యశాలలో శవమై కనిపించాడు. లోకం తెలియని ముగ్గురు పసి కందులు తల్లి శ్రావణిని హత్తుకుని బోరున విలపించారు. 'ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్తానంటివే లే నాన్న' అని పిల్లలు రోదించడం అందర్నీకలచివేసింది. వారిలో ఒక బాబు హాస్పిటల్ గ్రిల్స్ పట్టుకుని రోదిస్తుంటే వదిలించడం పెద్దల తరం కాలేదు.

కారును ఢీకొన్న టిప్పరు.. వ్యక్తికి స్వల్పగాయాలు

మార్టూరు, మే9 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయరహదారిపై ఒంగోలు వైపు వెళుతున్న కారును వెనుక నుంచి టిప్పర్ ఢీకొన్న సంఘటన శుక్రవారం జరిగింది. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ పైకి వెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న బండారు వెంకటేశ్వరరావుకు స్వల్పగాయాలయ్యాయి. అతను పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తి. మండలంలోని జొన్నతాళి గ్రామానికి అతను సొంత పనుల నిమిత్తం ఉదయం చిలకలూరిపేట నుంచి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా గాయపడిన అతనిని ద్విచక్రవాహనంపై పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బోధనోపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

అద్దంకిటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : బుద్ధిమాంద్యత వలన బడి వరకు నడవలేక ఇంటి వద్దనే విద్య పొందుతున్న ప్రత్యేక అవసరాల గల చిన్నారులు సమగ్ర శిక్ష ద్వారా అందిస్తున్న ప్రత్యేక బోధనోపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో బూధాటి సుధాకరరావు చెప్పారు. శుక్రవారం స్థానిక భవిత విద్యా వనరుల కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్ష ద్వారా మంజూరైన ప్రత్యేక టీచింగ్ మెటీరియల్ కిట్‌లను చిన్నారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఒక్కొక్క కిట్ విలువ రూ.15 వేలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాధం బాబురావు, కందుల గంగాధర్, సీఆర్పీ రామకృష్ణ, ఐఈఆర్‌టి కొంగల శ్రీనువాస్ పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు వెన్నులో వణుకు



సంఘీభావ కార్యక్రమం నిర్వహిస్తున్న పట్టణ ప్రజలు


అద్దంకిటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ భారతను ఉగ్రవాదంతో రెచ్చగొడితే ఆదేశానికి వెన్నులో వణుకు మొదలైందని, భారతదేశం అంటే ఎంటో ఆపరేషన్ సిందూర్ తెలియజేసిందని రిటైర్డ్ సైనికులు చాగంటి శేషారెడ్డి చెప్పారు. శుక్రవారం అద్దంకిలో నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం కార్యక్రమం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ భారత్‌లో ఉన్న 140 కోట్ల మంది ఒక్కసారిగా కన్నెరజేస్తే పాకిస్తాన్ మాడిమసై పోతుందని, ఉగ్రవాదానికి ఇవి చివరి రోజులని చెప్పారను. యుద్ధంలో అమరులైన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించి, కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాగినేని రామకృష్ణ, చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ ఖాసీంసాహెబ్, మహబూబ్, దివాకర్ దత్తు, రఘుచంద్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, పవన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

మేదరమెట్ల, మే 9(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి పి. శ్రీనివాసరావు చెప్పారు. కొరిశపాడులో నిర్వహిస్తున్న నవధాన్యాల కిట్ల తయారీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు నవధాన్యాల కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అశోక్, జాను, శ్రీనివాసరావు, మౌనిక, ప్రియాంక, శిరీషా, గౌరి, అంజలి, కరీమూన్, రైతులు పాల్గొన్నారు.

ఎండిన చింతచెట్లు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎండిన చింతచెట్లను తొలగిస్తున్న కూలీలు

పర్చూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు - ఇంకొల్లు ఆర్అండ్‌బీ రోడ్డులోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎండిపోయిన చింత చెట్లు ప్రమాదానికి నిలయంగా మారాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రయాణికులు ఎండిపోయిన చింత చెట్ల కింద నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. ఎండిపోయిన కొమ్మలు పడి ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు నిత్యం ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎండిపోయిన చింత చెట్లతో పొంచిఉన్న ప్రమాదం అనే కథనం ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు ఎండిన చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

బల్లికురవ, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు ఎస్టీ కాలనీలో రెండు రోజుల క్రితం అగ్ని ప్రమాదం సంభవించి రెండు కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శుక్రవారం అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు తదితరులు ఉన్నారు.